తెనాలి పట్టణంలో చోరీల కలకలం

- ఒకే రోజు పలు దుకాణాలలో చొరబాటు
- సీసీ పుటేజీల్లో నిందితుడి వివరాలు నమోదు
- ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని మార్కెట్ సెంటర్లో ఒకే రోజు వరుసగా ఐదు షాపుల్లో చోరీ జరగడం తీవ్ర కలకలం రేకెత్తించింది. ఐదు దుకాణాల్లో చోరీ యత్నం చేసిన దుండగుడు పలు దుకాణాల్లో నగదు అపహరించుకెళ్లాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో మార్కెట్ సెంటర్‌లోని వన్ టౌన్ , టూ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస చోరీలు జరిగాయి. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 1.30 గంటల మధ్యలో ఓ వ్యక్తి గడ్డపారతో సహా వచ్చి గాడిబావి సెంటర్, రామాలయం వీధి, మోటుమర్రివారి వీధి తదితర ప్రాంతాల్లో షాపుల తాళాలు, తలుపులు, షట్టర్లు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడ్డాడు. వీలైన చోటల్లా షాపుల్లోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్లలో అందుబాటులో ఉన్నంత నగదు అపహరించుకు వెళ్లాడు. ఉదయాన్నే షాపులు తెరిచేందుకుని వచ్చిన వ్యాపారస్తులు తమ తమ షాపుల తాళాలు తొలగించి ఉండటం, షట్టర్లు, తలుపులు పగులకొట్టి ఉండటం చూసి అవాక్కయ్యారు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూ టౌన్ పోలీసుల సమాచారంతో కొద్దిసేపటికి క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసింది. టూ టౌన్ సీఐ ఎస్ వెంకట్రావు, వన్‌టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలాలను పరిశీలించి వ్యాపారస్తులతో మాట్లాడారు. రాత్రి ఒంటి గంట తర్వాత చేతిలో పలుగుతో సహా ఆ దొంగ వీధుల్లో దర్జాగా తిరగడం, అదను చూసుకుని పలుగుతో షాపు తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించడం, తిరిగి బయటకు రావడం వంటి దృశ్యాలు చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదయ్యాయి. సీఐ మాట్లాడుతూ చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించామని, 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో రాత్రి గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. చోరీ వ్యవహారం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉదయాన్నే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గంగానమ్మపేట, గాడిబావి సెంటర్ ప్రాంతాల్లో చోరీ జరిగిన షాపులకు వెళ్లి వ్యాపారస్తులతో మాట్లాడారు. అక్కడ సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ జరిగింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాపాస్తులకు ధైర్యం చెప్పారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎమ్మెల్యేతోపాటు ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, భాస్కరుని శ్రీనివాసరావు, కొల్లా గురునాథ గుప్తా, చుండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.


ఉల్లిపాయల దుకాణంలో తెరచి ఉన్న బీరువా

క్లుప్తంగా

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు పోలీసులు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ రమేష్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐ శివరామయ్యలు కలిసి ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు వివరిస్తూ వారికి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఆటోలు నడిపే సమయంలో పాటించాల్సిన నియమావళి, జాగ్రత్తలు గురించి తెలియజేశారు. డ్రైవింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్యాసింజర్‌లను ఎక్కించవద్దన్నారు. అధిక వేగంతో వాహనం నడపవద్దని, ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపరాదని, మద్యం తాగి ఆటోలు నడపకూడన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయండి



తెనాలిఅర్బన్: సీపీఎం ఆధ్వర్యాన విజయవాడలో బుధవారం నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎస్.భవన్నారాయణ, కొల్లిపర బాబుప్రసాద్ కోరారు. తెనాలి మండల పరిధిలోని అంగలకుదురు, కోపల్లె, గుడివాడ, నందివెలుగు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిబిరం

తెనాలిఅర్బన్: హార్ట్ ఫుల్ నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉచిత యోగ, ధ్యాన శిబిరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారందరూ శిబిరంలో పాల్గొనవచ్చని చెప్పారు.

జీజీహెచ్‌లో అన్నదానం



గుంటూరు మెడికల్: అన్ని దానాల్లో కన్న అన్నదానం గొప్పదని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. జీజీహెచ్ ఓపీ వద్ద సోమవారం కాంతిలాల్ వినాయక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి అమావాస్య రోజున 300 మందికి పైగా పేద రోగుల సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని తెలిపారు. సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, నరేంద్రర్, మహావీర్, వేణుగోపాల్ శర్మ, రాం అగర్వాల్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: ఆదరణ కరువైన వృద్ధుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ తెలిపారు. ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించనున్న సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని సమితి కార్యాలయంలో 100 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యంతో పాటు 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అనేక మంది వృద్ధులు కుటుంబ సభ్యుల నుంచి నిరాదరణకు గురవుతున్నారని, వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మాదాల ప్రకాష్, ఎస్.వి.రమణ, పలకలూరి శివరావు, మురళీ సాయి, పి.రజనీశ్వరరావు, బొగ్గవరపు చిన్నబాబు, పి.లహరి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డులో గల విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. శిబిరంలో గుండె, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేవీ చౌదరికి ఆదర్శ దంపతుల పురస్కారం

రేపు తెనాలిలో పావులూరి ట్రస్ట్ వార్షికోత్సవ సభలో ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన పావులూరి ట్రస్ట్ 16వ వార్షికోత్సవం బుధవారం జరగనుంది. పావులూరి సరోజినీదేవి-బాపయ్యచౌదరి స్మారకార్థం ఏర్పాటైన ట్రస్ట్, పదిహేనేళ్లుగా తల్లిదండ్రులను ఆదరిస్తూ బిడ్డలుగా కర్తవ్యాన్ని నెరవేరుస్తూ, ఆదర్శంగా జీవిస్తున్న దంపతులను సత్కరిస్తూ వస్తోంది. తల్లిదండ్రుల ప్రాముఖ్యతను తెలియజేసేలా ధార్మిక ప్రసంగాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ క్రమంలో 16వ వార్షికోత్సవాన్ని స్థానిక వివేక విద్యాసంస్థల సౌజన్యంతో నిర్వహించనున్నారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని థియేటరులో ఉదయం 10 గంటలకు ఏర్పాటయే వార్షికోత్సవ సభకు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహిస్తారు. కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి-పున్నమ్మ దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత్రి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి 'తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు' అనే అంశంపై ధార్మికోపన్యాసం చేస్తారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొంటారు. ఇదే వేదికపై పట్టణానికి చెందిన గైనకాలజిస్ట్, శారద సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు ఆత్మీయ సత్కారం చేస్తారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పావులూరి భానుమూర్తి, శ్రీనివాసరావు పర్యవేక్షిస్తారు.


కేవీ చౌదరి-పున్నమ్మ దంపతులు

ఆనందోత్సాహాలతో దీపావళి

తెనాలిటౌన్: దీపావళి పండుగను ఆదివారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. యువకులు బాణాసంచా, టపాసులు కాల్చి పండుగ చేసుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. పట్టణ కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో అష్టలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజా కార్యక్రమాన్ని విశేషంగా ద్వాదశ హారతులు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదస్వస్తి నడుమ కార్యక్రమాన్ని శోభాయమానంగా జరిగింది. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం పర్యవేక్షణలో అమ్మవారి భక్త బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


బాణసంచా వెలుగులు

ఆక్యుపంక్చర్ సైన్స్ జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా 'ముంజంపల్లి'

గుంటూరు మెడికల్: ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్(ఆస్పా) జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా ముంజంపల్లి శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆస్పా భారత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మాకాల సత్యనారాయణ నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వివిధ రంగాల్లో సేవలందిస్తూ కోవిడ్ సమయంలో ఎంతో మందికి వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలను నిలబెట్టిన సామాజిక సేవ కార్యకర్త ముంజంపల్లి అని ఎన్నో మెడికల్ క్యాంపులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఆక్యుపంక్చర్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారన్నారు. కాలేజీల్లో, ఆశ్రమాల్లో, హాస్పటల్లో, వివిధ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందుకుగాను శివకుమార్‌ను జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించామని మాకాల తెలిపారు. ముంజంపల్లి నియామకంపై పలువురు డాక్టర్లు, ఫార్మసిస్టులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్.సి.ఎస్.రావు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.


ముంజంపల్లి శివకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సత్యనారాయణ, కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.రావు

భక్తిశ్రద్ధలతో గార్మి వేడుకలు

పొన్నూరు: పట్టణంలోని ఇస్లాంపేట ముస్లిం యూత్ ఆధ్వర్యంలో గార్మి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ హజరత్ సయ్యద్ మహబూబ్ సుభాని జండా చెట్టు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ అల్తాఫ్ హుస్సేన్, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్, పట్టణ ముస్లిం యూత్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనటంతో ఆరుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలులో ఆదివారం రాత్రి జరిగింది. చేబ్రోలు కొత్తపేట ప్రాంతంలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. యువకులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. జీబీసీ మెయిన్‌రోడ్డు సెంటర్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనటంతో షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ షాహీద్, షాబీర్, ఇర్ఫాన్, పఠాన్ పజిల్, షేక్ రియాజ్‌లకు కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. బాధితుల్ని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చేతిరాతను మార్చుకుని తలరాతలు దిద్దండి

- ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి
- ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్య శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు తమ చేతిరాతను మెరుగుపరచుకుని విద్యార్థుల తలరాతను మార్చాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి-పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 30 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడి, చేతిరాతను అందంగా మార్చుకోవడంలో తోటి ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ మోహనరావుతో కూడిన వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ బృందం ప్రతివారం సెలవు దినాల్లో తమ సొంత ఖర్చుతో ఈ విధంగా పాఠశాలలకు వెళ్లి, తోటి ఉపాధ్యాయులకు క్యాలీగ్రఫీలో ఉచితంగా శిక్షణ కల్పించడం ద్వారా వందలాది మంది ఉపాధ్యాయులను, తద్వారా వేలాది మంది విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. ఉప్పాల రామ మోహనరావు మాట్లాడుతూ చేతిరాత సక్రమంగా లేనివారు చదువుతో పాటు ఇతర ఏ విషయాలపై ఏకాగ్రత చూపలేరని, చేతిరాతను అందంగా మలచుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత కుదురుతాయని అన్నారు. చేతిరాత శిక్షణా కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయ మిత్రుల సహకారంతో ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈసందర్భంగా సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వందనం, జ్యోతికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు ప్రసాద్, ఇ.అనిల్‌కుమార్, షాజీర్, బురాన్, టి.శ్రీనివాస్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చేతిరాత శిక్షణ శిబిరాన్ని సందర్శించిన రవీంద్రనాథ్‌రెడ్డి, ఉప్పాల రామమోహనరావు, ఉపాధ్యాయులు

బాజీ బాబా దర్గాలో భక్తులకు అన్నదానం

పెదకాకాని: స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో సోమవారం అమావాస్య పురస్కరించుకుని రాత్రి పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న వక్ఫ్ బోర్డు ఈవో షేక్ ముక్తార్ బాషా

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

పెదకాకాని: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మినీ ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఆదివారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో వాహన తనిఖీలు చేపట్టారు. మండలంలోని గోళ్లమూడి గ్రామ శివార్లలో వాహనంలో ఉన్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న కుంభా ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఫిరంగిపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సోమవారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.


బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెదకాకాని: బాలల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్సన్ తెలిపారు. మండలంలోని నంబూరు యానాది కాలనీలో సోమవారం స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జాన్సన్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని ఏడు రోజుల పండుగగా స్కోప్ ఫౌండేషన్ నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు. మరో అతిథి డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంతోపాటు చదువుపైనా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు నాగార్జున యూనివర్సిటీ మినీ క్యాంటీన్ నిర్వాహకుడు బి.కిరణ్‌కుమార్ సహకారంతో భోజనం, నోటు బుక్స్‌ను అతిథులు పంపిణీ చేశారు. దాత కిరణ్‌కుమార్‌కు స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో షేక్ సల్మా, వరద, ఇందిరమ్మ , ప్రశాంతి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చిన్నారులకు అన్నదానం చేస్తున్న దాతలు

నేడు నగరంలో ఐక్యత విజయపథం యాత్ర

నెహ్రూనగర్: పేదరికం నుంచి పేద జన విముక్తే ధ్యేయంగా, ఐకమత్యమే లక్ష్యంగా మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐక్యత విజయపథం యాత్ర నేడు నగరంలోకి రానున్నట్లు దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి విల్సన్ తెలియజేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఐక్యత విజయపథం యాత్ర కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఏసీ కాలేజీ వరకు భారీ ర్యాలీ అనంతరం అక్కడి ఓపెన్ ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బండ్లమూడి స్టాలిన్ బాబు, వంక దొర శ్రీనివాస్, మేళం సునీల్ ప్రకాష్, నరేంద్ర సుధాకర్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

నేడు గాంధీనగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని ఐదో వార్డు గాంధీనగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీనగర్-1 సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

కాల్వలో పడి వ్యవసాయ కూలీ మృతి

తెనాలిరూరల్: కాల్వలో పడి వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబసభ్యులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం చావావారిపాలెంకు చెందిన నీలా మోషే(55)వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అంగలకుదురు పరిధిలో పొలం పనులకు ఆదివారం వెళ్లిన ఆయన సాయంత్రం తిరిగి వచ్చే సమయంలో తుంగభద్ర సైడ్ ఛానల్ వద్ద ఆగాడు. కాళ్లు కడుగుకుందామని కాల్వలోకి దిగిన అతను ప్రమాదవశాత్తు జారి పడడంతో నుదురు, ముఖంపై తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మోషే వినియోగించే సైకిలును కాల్వ గట్టు వద్ద గుర్తించారు. కాల్వలో గాలించగా కొద్దిదూరంలో మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.